# అహో రాగవతీ సంధ్యా

అరుణ సంధ్య అంతరించి నిశి ఆవరిస్తున్నదని తెలిపేం దుకా అన్నట్టుగా తోటల్లోని చెట్ల ఆకులన్నీ హరితమును వదిలి నలుపురంగును స్వీకరిస్తున్నాయ్ ! తోటవైపు కిటికీ దగ్గరసా కూర్చుని "థెల్మా" చదువుకుంటున్న అరుణ కాలింగుబెల్ గణ గణ మంటూంటే విసుక్కుంటూ లేచి తలుపుతీసింది. తనకెదురుగా నిలబడ్డ పాతికేళ్ల యువకుని చూడగానే త్రుళ్ళిపడింది.

"అనంత్! ఓ!" చిన్నపిల్లలా వెనక్కు ఒక్క అడుగేసింది. అతనికి ఏమీ అర్థంకాలేదు. బెదురుగా ఆమెవైపు చూస్తూ "సావిత్రిగారున్నారాండీ!" అని డోరునెంబరువైపు మరోసారి పరిశీలనగా చూసాడు.

"వో!" చిత్రంగా నవ్వింది అరుణ.

"స్నానం చేస్తున్నారు. అల్లాకూర్చోండి!" కుర్చీ చూపించి ఒక్క అంగలో తన గదిలోకి వెళ్ళిపోయింది.

ఆ యువకునికి తన్ని చూడగానే ఆమె ఎందుకు అలా గయిపోయిందో అర్థం కాలేదు. కాని ఆమె సౌందర్యం అతన్ని ముగ్ధుణ్ణిచేసింది. ఏమి సౌందర్యం? తల ముందు భాగంలో మొగలి రేకులా నెరిసి వున్నా, ఆ చెక్కిళ్లలోని మెరుపూ ముఖంలో మారే రంగులూ! అబ్బ! అనుకున్నాడు— ఆయువకుడు!

అరుణ కాస్సేపు తనగదిలో, అటూ ఇటూ తచ్చాడింది. సావిత్రి ఇంకా "బాత్ రూం" వదలి రాలేదు. అరుణ మనస్సు అతను కూర్చున్న డ్రాయింగురూం చుట్టూ పరిభ్రమించ సాగింది. అతను ఏంచేస్తున్నాడో? తను జ్ఞాపకం వుందా? సావిత్రితో అతనికేంపనీ? పోనీ కనుక్కుంటే? అతని ఎదురుగా తను నిలబడగలదా? అతని ముఖంలోకి సూటిగా చూడగలదా? తన్ని ఆనమాలు పట్టేడేమో! అరుణా! అంటూ చేతులు చాపుతూంటే తను కిన్నెరలాకరిగిపోదూ? భగవాన్! సావిత్రి తన్ని గురించి ఏమనుకుంటుంది? తన్నికూడా ఒకప్పుడు పాశవిక శక్తులు అలముకున్నాయని సావిత్రిముందు ఒప్పుకోవాలా? ఇన్నిరోజులుగా తన్ని ప్యూరిటన్ గా ఆరాధించిన సావిత్రి దృష్టిలో తను చులకనైపోదూ? అరుణలో భరించలేని ఆవేగం కల్గింది. చేతిలో డ్రైరీఫుచ్చుకుని చెప్పా లేసుకుని సముద్రతీరంవేపు నడిచిపోయింది. ఆమె "గ్రేస్ ఫుల్ వాకింగ్"కి అద్భుతపడ్డాడు యువకుడు! ఎవ్వరూలేనిచోట కొబ్బరిచెట్లనడుమ కూర్చుంది. వంటరిగా వున్నకొద్దీ ఆమెలో ఆపుకోలేనిదుఃఖం వస్తోంది. సముద్రకెరటాలు చంద్రునికోసం చేతుల్లో తెల్లని నురగలు కానుకలుగా ఎత్తిచూపుతున్నయ్. చంద్రుడు తారలమధ్య బంధితుడై అనురాగాన్ని వెదజల్లుతున్న కెరటాల పాలపొంగును తెల్లబోయి చూస్తున్నాడు. కెరటాలు అతని అస్వతంత్రతను గమనించి తారలమీాది కోపంతో ఉవ్వెత్తుగాలేచి అంతలో మళ్లీ నిస్సహాయమైపోగా తడవ తడవకూ గుప్పెడు ఇసుక రేణువుల్ని బారెడు

దూరం కదిలించగలుగుతున్నాయ్! చంద్రుడూ— కెరటాల నాటకాన్ని మౌనంగా పరీక్షిస్తున్న అరుణ మనస్సు ఇరువయి అయిదు శిశిరాల వెనకాతలి వసంతాన్ని స్మృతిలోకి తెచ్చుకో ప్రయత్నిస్తోంది.

"ఈసారి నీకు బాగా తోస్తుందిలే! అసలు మీవూరు పొమ్మన్నా పోవు!" అన్నాడు నందబాబు బండిదిగుతున్న అరుణని చూస్తూనే.

"ఏమిటబ్బా ఆ విశేషం?" ఛెంగున లేడిపిల్లలా రెండెడ్ల బండిలోంచి గెంతిన అరుణ అడిగింది.

"ఏం లేదమ్మాయ్! అంతే, ఒక నెల అయ్యుంటుంది. ఎవరో అనంతకుమార్ సాహేట! ఇక్కడి "సన్ సెట్" రమణీయంగా వుంటుందని ఎవరో చెప్పగా విని "చిత్రాలు" వేసుకుందు కొచ్చాడు. మన పాతతోటలో చిన్న "టెంట్" వేసుకుని వుంటున్నాడు. భోజనం మనింట్లోనే!" పూర్తి చేశాడు మామయ్య.

"ఇంకేం! ఈ వూరు చిత్రకారులను కూడా ఆకర్షిస్తోం దన్నమాట. మామయ్యా! ఇదంత నీ చలవేకదా!" అంది.

"సాక్షాత్తూ ఋశ్యశృంగుడు. ఆ పయిన నీ ఇష్టం!" అన్నాడు నందబాబు.

"అల్లాగా పాపం! అవధాన్లువారూ? వారు ఋశ్యశృంగులయితే, మీరు నందకిషోరులు కారుటండీ!" అంది వెటకారంగా.

"అదికాదు పిన్నీ ! మరేం, నిన్ననే చెప్పా! ఆయనతో! నువ్వు వస్తావనీ, బాగా పాడుతావని" నందబాబు కూతురు జయంతి కళ్ళు తిప్పుకుంటూ చెప్పింది.

"ఆసి పిల్లకానా! ఎవరు చెప్పారూ నీకు నేనొస్తున్నట్టు?"

"నిన్న పాలేరు రాముడు బండికి గూడు కట్తూంటే అడిగా! చెప్పాడు. మరేం, అమ్మ అరిసెలు చేసింది నీకోసం!" అంది. జయంతి రెండు బుగ్గలూ చిదిమింది అరుణ.

అరుణ ప్రతి సెలవులకూ విధిగా రామసముద్రం వస్తుంది. అది ఆమె మాతామహుల వూరు. రామసముద్రం చిన్న బ్రాహ్మణ అగ్రహారం. బ్రాహ్మణులవి పదిఇళ్లకు పైన వుండకపోయినా, రెండు మూడువందల గడపదాకా పల్లె వాళ్లున్నారు. ఒకవెంపు సముద్రం, ఒకవెంపు చిన్న పిల్ల కాలువ వూరినిచుట్టి వుంటుంది. చిన్న ద్వీపకల్పంలా వుంటుంది. అరుణ మాతామహులు వంశపారంపర్యంగా ఆవూరికి కరణీకం నిర్వహిస్తున్నారు. ఇప్పుడు అరుణ మేన మామకూడా కరణీకంచేస్తున్నాడు. అరుణ వాళ్ల ఇంటి వెనుక నించి కాలువగట్టుదాకా పెద్దతోటవుంది. మామిడి, జామ, సపోటా, జీడిమామిడి, సీతాఫలం, రామాఫలం, దానిమ్మ, కాశీరేగు, నిమ్మ, నారింజ, బత్తాయి, దబ్బ, బాదంచెట్లు దండిగా వున్నాయ్. అన్నిటికన్నా అక్కడవాళ్లకిముఖ్యం కొబ్బరిచెట్లు. మామయ్యకు మూడు వంతులు ఆదాయం కొబ్బరిచెట్ల వల్లనే వస్తోంది. ఇసుక ప్రదేశంకావటంవల్ల కొబ్బరిచెట్లు ఏపుగా పెరుగుతాయ్. చేతికి అందే చిన్న

చెట్లుకూడా విస్తారం కాసేవి. బాదంచెట్ల వెనకాతల అరుణ అమ్మమ్మ వేసిన మల్లెచెట్లున్నాయ్. అవి విరబూసేవి. అరుణ వచ్చిందంటే ప్రొద్దస్తమానూ మల్లి తుప్పలకేసి తిరిగేది. అక్కడకూర్చుని కాలువకేసిచూస్తూ ఎన్నిగంటలైనా కాలక్షేపం చేసేది. ప్రక్కగా మల్లెపూల సౌరభం దూరాలనుండి మావిడిపూత వగరును మోసుకువచ్చే వసంత పవనం ఆమెను పురూతలూగించేవి. కాలువనీళ్లల్లో కాళ్లాడిస్తూ కూర్చున్న అరుణని మామయ్య కూతుళ్లు వెనకాతలేవచ్చి దడిపించేవారు. ఆపళంగా పెద్దపెట్టున రాగాలు పెట్టుకుంటూ మామయ్యకూ, అత్తయ్యకూ ఫిర్యాదుచేసేది. వాళ్లు తమపిల్లల్నే కోప్పడేవారు. వదినలందరూ అత్తవారిళ్ళకు వెళ్ళిపోయారు. అత్తయ్య చని పోయింది. ఏమిటో వంటరితనం. ఫీలయింది–అరుణ. మామయ్యతో కాస్సేపు రాజకీయాలు చర్చించటం, నంద బావ దగ్గర "భవభూతి కవి" "ఉత్తరరామ చరిత" వినటం (అతనికి మహా ఇష్టం మరి) జయలక్ష్మితో కాస్సేపు లోకాభి రామాయణం, ఇరుగుపొరుగు అమ్మాయిలొస్తే పచ్చీసు ఆడుకోవటంతో ఆమెకు కాలం గడిచిపోతూంది. జయంతి ఎక్కడా చేతికందటంలేదు. మునపట్లా సముద్రతీరానికిగానీ, కాలువ వొడ్డునకుగానీ పోవటానికి జంకు పుడ్తున్నది. "అనంతకుమార్ సాహో" వీళ్ళింటికే భోజనానికి వచ్చేవాడు. అరుణ ఆ వేళప్పుడు ఏదో పుస్తకం పుచ్చుకుని మేడమీదుండేది. ఒక్కోసారి మెట్లపైన నించుని అతన్ని చూసేది. ఎర్రని పట్టు ఉత్తరీయం కప్పుకుని వచ్చేవాడు. అతని వెనకాలే జయంతి

వచ్చేది తోకలా! అతని ముఖంలో ఏదో వర్చస్సు వెలిగి పోతూ కన్పించేది అరుణకి! ఎదుట పడటానికి ఆమె శరీరం జల తరించేది. బయటికి పోవటానికి కూడా అతను కనపడుతాడనీ భయం! కారణం-అతను చిత్రకారుడు! భావుకుడు! అతని కళ్ళు ఎక్స్‌రే కళ్లు! ఆ చూపు లతన్ని నిలబడనీయవనే అను మానం!

ఒకరోజు స్వయంగా విన్నది. అతను అడుగుతున్నాడు. తన్ని గురించే!

"మీ ఇంట్లో ఎవరో బాగా పాడేవారొస్తారన్నదే జయంతి? రాలేదా!" ఆమె చెవులు నించున్నాయి.

"రాకేం? వచ్చి వారంరోజు లయింది. ఆమె అంతః పురాంగనుండీ! పైగా విద్యాధరి! మనకు కన్పడుతుందా?" అన్నాడు నందబాబు.

"పిన్నిని పిలుచుకురానా తాతయ్యా!" అవసరం గుర్తించినదానిలా అడిగింది జయంతి.

మామయ్య తటపటాయించాడు. ఆయన అరుణ అను మతి లేనిదే చనువు తీసుకోడు.

"నిద్రపోతున్నదేమో నమ్మా!" దాటేశాడు. అనంత్ ఆలోచించాడు. అతను వీళ్ళకి బాగా చనువయ్యాడు. ముస లాయన అప్పుడప్పుడు వచ్చి పల్కరించి పోతూంటాడు. నంద బాబు కావ్యపఠనం చేస్తూంటాడు. జయలక్ష్మి ఎప్పుడూ సోదరునిలా ఆప్యాయతతో పల్కరిస్తుంది. జయంతి సరేసరి! ఆమెకు సరదా తన కుంచెలే ఆటవస్తువులు! మరి ఈవి

డెవరో!! తనపట్ల విముఖత ఎందుకో! ఎల్లా వుంటుందో! ఒక్కసారి కన్పిస్తేనే కొంప మునిగిపోయిందా?

"అరుణా! బాదంచెట్టు వెనకాతల అమ్మమ్మ మల్లి తెగపూసిందట! కాసినికోసి తెద్దూ! జయంతి జడ కుట్టుమని ఒకటే గోల!" అంది జయలక్ష్మి. ప్రొద్దుటే కాఫీ పుచ్చుకుని "పెన్" చేతిలో పుచ్చుకుని మేడెక్కబోతున్న అరుణ క్షణం తటపటాయించింది.

"రాముడు లేడా అక్కా!" అంది.

"వాడెక్కడా తెల్లారకుండానే, గొడ్లను విప్పుకుపోతే! అది సరేకాని చెల్లీ! మునుపు పూలు కోయాలంటే ఎగిరి గంతేసేదానివి? ఇప్పుడీ వుదాసీనతకు కారణం ఏమిటి? రాబోయే రాకుమారుడికోసం కలలుకంటున్నావా?"

అరుణకు సిగ్గేసింది ఎవరో తోటలో మకాం వుండటమేమిటి? తన్నితను బంధించుకోవటమేమిటి? చిత్రం! తల విదిలించింది.

"ఛీఛీ! బలేదానివే! బావ హాస్యం నీకూ్కడా వంట వంటపట్టినట్లుంది! పదవేజయా?" అంది, అరుణ లేని వుత్సాహం ముఖానికి పులుముకుని. జయంతి గమ్మున లేచింది.

"పద, పదపిన్నీ! ఆలస్యం అయితే మేష్టారు షికారెళ్లిపోతారు."

మేష్టారూ? ప్రశ్నార్థకంగా ముఖం చిట్లించింది.

"ఆయనే పిన్నీ! బొమ్మలేస్తారు. బోల్డు కథలు చెప్పారు. నాకు, ఆయన చాలా మంచారు పిన్నీ! వాసవదత్త, ఉపగుప్తుడు, సుజాత, ఆమ్రపాలి, చండాలిక, మరేం. మరీ..

ఏమిటీ ఆ కేటలాగు?

"ఆయన కథలు పిన్నీ!"

"బాగానేవుంది." మూతి ముచ్చటగా తిప్పింది.

"మరేం! రోజూ నిన్ను గురించే అడుగుతుంటారు."

"నన్నా?"

"అవును."

"ఏమని?" కుతూహలం రేకెత్తింది.

"ఏం చీర కట్టుకున్నావనీ, ఎల్లా వుంటావనీ, ఏం చేస్తుంటావనీ? మొన్న అత్తయ్యగారింటికి పేరంటం వెళ్ళి నప్పుడు చెప్పాను. మామిడిచెట్టు దగ్గర చీకటి పడేదాకా నించున్నారలా నువ్వొస్తావనీ, నిన్ను చూడాలనీ."

"నన్నా! చూడాలనా!"

"నీ పాట వినాలట."

"నా పాట!"

"అవును. నువ్వు ఎంచక్క పాడతావని చెప్పా!" కోపం వచ్చింది అరుణకి.

"నువ్వు ఇవన్నీ చెప్తున్నావా?" అదిలించింది.

"అబద్ధా లాడకూడదు అంటాడు నాన్న! అంచేత చెప్తున్నాను" బిక్కమొగంవేసి సత్య హరిశ్చంద్రుడిలా అంది జయంతి.

మామిడిచెట్ల నీడలో నడుస్తున్నాను. పట్నం పోయి పెరుగమ్ముకొనే గొల్లభామలు అరుణని కుశలప్రశ్నలు వేసారు. దూరంగా బాదం చెట్టుక్రింద స్టాండ్ దగ్గర నించున్నాడు సాహో కాలవ కవతల దేన్నో దీక్షగా చూస్తూ "స్టాండ్" మీాది చిత్రం దిద్దుతున్నాడు. కాలువలోంచి పైకొస్తున్న ట్లున్న ఉదయారుణుడు తన అరుణకాంతితో ఉషాకన్యని లజ్జాన్వితను చేయగా సమస్త ప్రకృతీ అరుణిమను పులుము కుంటున్నది. బాదంచెట్టు దాటి పశువులశాల కావలగా వున్నయ్ మల్లితుప్పలు. అరుణ కాళ్ళు భూమికి అతుక్కు-పోయాయ్. గుండెల్లో ఏదో భయం!

జయంతి "మాస్టారూ! ఇదిగోనండీ పిన్ని! చూడండి!" పిన్ని ఎక్కడికో పారిపోతుందేమో అన్న భయంతో గట్టిగా చప్పట్లు చరిచి పిలిచింది. చటుక్కున ఇటు తిరిగి చూశాడు. అతనిముఖం ప్రఫుల్లమైంది. గమ్మున దగ్గరగా వచ్చాడు.

"నమస్తే! చాలారోజులకి బయటకు వచ్చారే!" స్నేహ పూరితంగా అన్నాడు.

అరుణ మాట్లాడలేదు. రెండుచేతులూ జోడించి ప్రతి నమస్కారంచేసింది. "మాపిన్ని మల్లెపూలకోసం వచ్చిందండీ! మీాకు చూపెట్టేసా!" స్పెష్ట్రిప్ చేసి వచ్చినంత గర్వంగా అంది. జయంతి.

అల్లాగా! అయితే పదండి!" అన్నాడు.

అనటమేతడవుగా అరుణ కాళ్లుకదిలాయ్. అతనిస్టాండ్ ప్రక్కనించిపోతూ "స్టాండ్" మీాదకు దృష్టిమరల్చింది. చక్కని

చిన్నచిత్రం. కాలువలోని నీళ్లల్లో వుదయారుణకాంతులు ప్రతిఫలిస్తున్నాయ్ ! వాటి నీడల జాడల్లో బాదంఆకుల చివర్లు, లజ్జతో కందిపోయిన మల్లెపూల రేకులూ, తరళిత మౌతున్నయ్ ! ఎంతభావుకత ! మల్లితుప్పల దగ్గరగా వెళ్లింది. ఆ పూలు ఆమెకు కోయబుద్ధికాలేదు. జయంతి మటుకు అంది నన్ని పూలు పుటుకూపుటుకూ త్రెంపివోడి నింపుకుంటున్నది. ఆ పిల్లకి ఈ తరుణ హృదయం వివశం ఏం తెల్సు ?

"పూలు కోయకుండా నిలబడిపోయారేం ?" కాలువలో దిగి ముఖం కడుక్కొని చేతిరుమాలుతో తుడుచుకుంటూ వచ్చి అడిగాడు సాహో.

"జయంతి కోస్తున్నదిగా !"

"మీకు అఖర్లేదా ?"

"ఉహుం. దానికోసమనే ! అది జడ గుచ్చుకుందామనుకుంటున్నది." సాహో అరుణ జుట్టుకేసి చూశాడు. ఒత్తుగా, ఒంకులుగా, నల్లగా మెడ నిండుకూ జారుతున్నది, ఆమె జుట్టు ! అతను చూస్తుంటే అరుణ తలవంచుకుంది.

"మీకు చాలా సిగ్గు. చదువుకుంటున్న నాగరికతా లక్షణాలున్న అమ్మాయిలా లేరు."

"ఏం ?" అన్నట్లు ముఖమెత్తి చూసింది.

"నిజం చెప్తున్నాను. నేను ఏ వూళ్లో మకాం వేయనీయండి. ఆ వూళ్ళో కాస్త చదువూ, సంస్కారం వున్న ఏమాత్రపు వ్యక్తి అయినా నా స్నేహాభిలాషను కోరేవాడు. తీరిగ్గా బాదంచెట్టు నానుకొని నించుని చెప్పుకపోతున్నాడు.

"ఇంక అమ్మాయిలంటారా, సరేసరి! వాళ్ళు రూప చిత్రాలు వేయమని పీక్కుతినేవారు. నేను ఎక్కువగా భావ చిత్రాలను, ప్రకృతి వర్ణ చిత్రాలను వేస్తానని మొత్తుకున్నా వినిపించుకునేవారు కారు. మిమ్మల్ని గురించీ, మీ రాక గురించీ విన్నాక ముందు భయపడ్డారు. కాని వారంరోజులు ప్రతీక్షిస్తున్నాను ఉరుముతుందేమోనని! మెరుపు కళ్ళ పడింది. ఎందుకని ఈ వారంరోజులూ తప్పించుక తిరిగారు?"

"అలా ఎందుకనుకుంటారు?"

"మరి నాతో మాట్లాడాలనీ మీకు అనిపించలేదూ? మీ ఇంటికివచ్చినప్పుడుకూడా జాడా జవాబు లేదుకద! ఆత్మీయత ధ్వనించింది.

"ఎందుకో! ఆ క్యూరియాసిటీ!"

"చూడండి! నేను చిత్రకారుణ్ని, మాకు స్నేహము ఆరోప్రాణం అనుకోటంకంటే మాకు తిండీ తిప్పలూ మా మనుగడకూడా స్నేహమే అంటే సముచితంగావుంటుంది. మా మనస్సులు స్నేహపూరితంచేసుకుంటే కాని భావభరితం కానేరవు. భావుకత లేనిదే చిత్రాలకు రసస్పందనరాదు. అందులో మీరు మధురగాయని అని మామయ్యా, జయంతీ చెప్పారు." అతని ఎక్స్‌రే కళ్లల్లో ఫ్లాష్ బల్బు వెలిగింది.

"చెప్పారూ?"

"మీ పాట వినాలనీ!"

"వినీ!"

"ఆ అనుభూతిని చిత్రంగామలుచుకోవాలనీ"

"తర్వాత!"

"అది మీకు ప్రజెంటేషన్ ఇయ్యాలనీ"

"నాకా?"

"అవును!"

"ఎందుకు?"

"ఆ చిత్రానికి భావం ప్రేరేపించినందుకు."

"నేనా!"

"అవును! అరుణా! మీరే నాచిత్రాలకు భావం అయితే! ఒక్కసారి నా "డేరా"కురండి! మీరు వచ్చాక చిత్రించిన చిత్రాలు చూద్దురుకాని!"

"నేను మీతో ఇదేకద మొదటిసారిమాట్లాడుతా?" ఆశ్చర్యం ప్రకటించింది. "అయితే ఏం? ద్రోణుడు ఏకలవ్యుడికి గురువుకాలా! మీరువస్తారు. బాగా పాడుతారు అన్న భావమే నాలో అవ్యక్తానందాన్ని ప్రసాదించిది. అది చాలదూ! మీరు నిత్యం పీఠంవేసుకు కూర్చోవాలా?" ఆప్రశ్న అసహజంగా విన్పించింది అరుణకి. "మీరు నిత్యం నాసమక్షాన్న వుండాలి" అనుంటే ఆమేకుసంతృప్తిగావుండును. ఆమెలో ఏదో జయదీక్ష కలిగింది. సౌందర్య వతులయిన యువతులకుండే అహంభావం ఆమెను ఆవహించింది. "పదండి. చూస్తాను గురుదక్షిణ ఏమిస్తారో!" మురిపెంగా అంటూ అతన్ని అనుసరించింది.

"ఆవుల మందలు వెళ్తున్నాయ్. వాటి వెనుక గోచీ తప్ప మరో బట్టలేని కుర్రాళ్ళు మెల్లగా కొబ్బరి ఆకుల బూరాలు వూదుకుంటూ కాలవ గట్టమ్మటే నడుస్తున్నారు.

"శస్యుషస్సులో కాలువ రేవులో సువాసినుల స్నాన ఘట్టం."

"మర్రిచెట్టు తిన్నెచుట్టూ పంచాయతీ పెద్దమనుష్యుల మీటింగు."

"చచ్చిన కాకి చుట్టూ కాకులు అరుస్తూ మూగడం."

"కుప్పలు నూర్చే ఎడ్లు," మామిడిచెట్ల పూతమీద మెరిసే వెన్నెల! కొన్ని బౌద్ధ చిత్రాలు - ఒకటేమిటి? కాదేదీ కవిత కనర్హం? అని శ్రీ శ్రీ అంటే, కాదేదీ చిత్రణ కనర్హం? అని అన్వయించుకున్నాడా! అనిపించే టన్ని చిత్రాలు వేసుకున్నాడు. లేత రంగుల్లో, కన్నులు చెదిరే ముదురు రంగుల్లో, ఆకృతి చిత్రాల్లో ప్రదర్శించే భావాలకి రంగులు సహజంగా ఒప్పేయ్.

"కాలువ వడ్డున సూర్యాస్తమయ దృశ్యం ఎంతో మనోహరంగా వుంటుంది. అది చిత్రించలేదా?"

"ఈరోజే అరుణోదయాన్ని చిత్రించుకున్నాను. అస్తమయ చిత్రాన్ని చిత్రించటానికి వ్యవధి కావాలి."

"సాయంత్రం చిత్రిస్తారు కామోసు!"

ఊహుఁ. ఇప్పుడప్పుడే కాదు. ప్రస్తుతం గీతగోవిందం చిత్రించా లనుకుంటున్నాను. మీరు బాగా పాడతారు కద!"

"ప్చ! ఏదో..."

"అల్లాగనకండి. మిమ్మల్ని చూశాక ఒక చిత్రం చిత్రించాను. రేపు చూపెడతాను."

"ఇప్పుడేం?"

"కాదు. మరి మీరు పాడాలి.

"ఏం పాడను ?"

"ఏదైనాసరే జయదేవకృతి. సఖి ఉద్బోధ పాడండి."

హిందోళలో గొంతు సారించింది.

"హరిరభిసరతి వహతి మధుపవనే
కిమపర మధిక సుఖం సఖిభవనే
మాకురు ! మానిని మానమయే !
మాధవే... ...

అలా నిలబడి పోయారేం ?"

"వింటున్నాను."

"నేను పాట ఆపేయగానే కుంచెలూ, రంగులూ తీస్తా రనుకుంటాను. స్థాణువులా నిలబడ్డారు. బహుశా నా గానం మిమ్మల్ని చైతన్యంలోంచి జడత్వంలోకి పరివర్తింపజేసి వుంటుంది."

"అలా ఎందుకనుకుంటారు ? హృదయంలో ఇంకేం అనుభూతులూ లేకుండా పరిపూర్ణమైన తృప్తి పీయూషంలా నిండిపోయింది నాకు."

"ఓ కవిత్వం ! మరి బొమ్మ చూపించరూ ?" ప్రాధేయ తగా అంది.

"రేపన్నానుగా ?"

"ఇప్పుడేం ?"

అతను మురిపించినకొద్దీ ఆతృతకూడా ఎక్కువయింది అరుణకి.

"ఇప్పుడు మీ పాటతో నాలో కలిగిన అనుభూతిని చిత్రంగా వేస్తాను. రేపురండి. రెండూ తప్పకుండా చూపెట్తాను."

"నేనుమళ్లీ రావటానికి వంకన్నమాట! అంతేనా?"

"రాకూడదా!"

* * *

"నేను ముందే చెప్పానుగా? మీ వూరు వెళ్లమన్నా వెళ్లీవు అనీ!"

"పోదూ!" అంది అరుణ. కాళ్లకి చమ్కీ పనిచేసిన చప్పల్సు వేసుకుంటూ.

"మరి రా పిన్నీ! చప్పున తీసుక రమ్మన్నారు మాష్టారు." అరుణచేయిపుచ్చుకు లాగుతూ అంది జయంతి.

'జాగ్రత్తేఅరూ! ఆతను రేపే బిచాణా ఎత్తేస్తున్నాడు. ఆపైన నువ్వు బెంగెట్టుకునీ లాభంలేదు. మనం మన మనస్సుని స్వాధీనంలో వుంచుకోవాలి!"

"ఏమిటీ! మీరు బొత్తిగా మితిమీరుతున్నారు! కుర్రపిల్లనిచేసి ఆడిస్తారా మా చెల్లిని!" జయలక్ష్మి మందలించింది.

"కాదే! ఇన్నాళ్లూ అతనికి కనపడకుండా దాగిలి మూతలాడింది. ఇప్పుడు ఇంక ఇరువయి నాలుగ్గంటలూ కవితాచర్చలూ, చిత్రకళావిమర్శలూ చెవులు హోరెత్తిస్తున్నారు. అందుకే ఆడిపిల్లా గొల్లచల్లా అన్నారు. కాస్త కదిపితే పారిజాత పువ్వుల్లా జల జల్లాడే అబలలు!!"

"బాగానేవుంది. మీ సానుభూతి!" మూతి మూడు వంకర్లు తిప్పింది జయలక్ష్మి.

సూర్యుడు అస్తమిస్తున్నాడు. సంధ్యాకాంత నిశా దేవికి చంద్రుని సరళత్వాన్నిగూర్చి భోధిస్తున్నది. తోటలో తెల్లని అతని గుడారంమీద పల్చని వెన్నెల నీడలు ప్రాకు తున్నాయ్ : అతనిగొంతు కొవ్వొత్తి క్రీనీడలలో

అహ! మేక్ ది మోస్ట్ ఆఫ్ వాట్ వుయ్ ఎట్ మేస్పెండ్

బిఫోర్ వుయ్ టూ ఇన్ టుది డస్ట్ డిసెండ్

డస్ట్ ఇన్ టూ డస్ట్ అండ్ అండర్ డస్ట్ టులై;

శాన్స్‌వైన్, శాన్స్‌సాంగ్, శాన్స సింగర్, అండ్ శాన్స్‌ఎండ్ :

చదువుతూంది. ఏదో మత్తు ధ్వనించింది అరుణకి.

"ఏమండీ! బౌద్ధ కథల్లోంచి ఒమార్ కవిత్వంలోకి వెళ్ళిందే! ఇది పురోగతా? తిరోగతా?" అంది అరుణ.

"మీ రేదనుకుంటే అదే! చూస్తా రేమిటి?"

"ఏమిటీ!"

"దానికి వేసిన చిత్రం!"

బరువుగా వూపిరి పీల్చి విడిచింది అరుణ.

"ఎం?"

"చూస్తాను."

వెన్నెల జాలువారుతున్నచోట పెట్టాడు ఆ చిత్రాన్ని. చేతుల్లోని మధువుని ఒమార్ పెదవులమీద పాన పాత్రలో

ఒంపుతున్న 'సాకి' చిత్రం లేత రంగులు! అంతకన్న లేతగా చిరుగాలికి చలించె 'సాకీ' గులాబీ పెదవులు! ఆ జీవులు తను చాటుగాబోతే మాట్లాడుకుంటారేమో అని భ్రమసింది అరుణ. జయంతి తివాసీమీద పడుకుని నిద్రపోయింది.

"ఈ చిత్రం మీకు ప్రజంటేషన్!"

"నా కెందుకు? జయదేవ కృతికి ప్రతిచిత్రం వ్రాస్తా నన్నారు?"

"అది వేద్దామనే ప్రయత్నంలో నా కిది వచ్చింది."

"అస్తమయ దృశ్యం వేశారా?"

"ఏమిటో చెప్పలేను అరుణా! ఇక్కడి ఉదయాన్నే కాని అస్తమయాన్ని భరించగలిగే స్థితిలో లేదు నా మనస్సు!"

"అబ్బ!" నవ్వింది అరుణ.

"నిజం.........."

జయంతిని లేపి ఇంటికి వచ్చేసరికి నందబాబు పొరుగింటి శాస్త్రిగారికి—

ధూమజ్యోతిస్సలిల మరుతాం
సన్నిపాతః క్వమేఘః;
సందేశార్థాః క్వపటుకరణైః
ప్రాణిభిః ప్రాపణీయాః।
ఇత్యౌత్సుక్యా దపరిగణయన్.
గుహ్యా కస్తం యయాచే,
కామార్తాహి ప్రకృతి కృపణా,
శ్చేతనా చేతనేషు."

అన్న శ్లోకంలోని అర్థం వివరించి చెప్తున్నాడు!

చంద్రుడు మధ్యకి వచ్చాడు. సముద్ర తీరం పొడు వునా మనుష్యులు నడుస్తున్నారు. కొబ్బరి ఆకులు వెన్నెలని చూసి సంతోషంతో తలలూపుతున్నాయ్. చిరుగాలికి అరుణ డైరీలోని పుటలు టపటపా కొట్టుకుంటూ ఎగురు తున్నాయ్. డైరీలోని చిన్న కాగితంముక్క ఎగిరి సముద్ర కెరటాలతో ఆడుకోబోయింది. ఆ కాగితంముక్క స్నేహం తెలియని సముద్ర కెరటాలు దాన్ని తడిపేయ బోయాయ్. అరుణ ఆ కాగితంముక్క చేతులోకి తీసుకుని చదువుకుంది. చిన్న తెల్లకాగితంమీద ఆకుపచ్చ సిరాతో ఎవరో హిందీ కవి పెట్టిన ఆటోగ్రాఫ్ అది.

"హుస్న సోతారహే ఇష్క్ రోతారహే
జిందగీ బస్ యూఁహీ ముస్కరాతీరహే"

మూడురోజులక్రితం తమకాలేజీలో సాహిత్య సమా వేశాలు జరిగాయ్! తనకు తెలియకుండానే ఆటోగ్రాఫ్ అడిగింది అందర్నీ! హిందీపద్యకవికి తనముఖం చూసేసరికి ఏం తట్టిందో! కాగితంమీద ఈ ముక్కలు వ్రాసిచ్చేడు! ఇన్నాళ్ళయిన తర్వాతకూడా తన సౌందర్యం భావుకతని ప్రేరే పిస్తున్నదంటే ఆశ్చర్యమే! తనకళ్ళలోని దైన్యభావమే ఆయన్ని అలా వ్రాయమని ప్రోత్సహించిందా? ఇందాక "అనంత్"ని చూడగానే తను చలించిపోలేదూ? "అనంత్" పిసరంతయినా మారలేదు. అవే నవ్వుతున్న పెదవులు. ఎదుటి హృద యాన్ని పిండే చూపులు! ఏమనుకుందో సావిత్రి? అక్క

డుంటే నిశ్చయంగా పరిచయం చేసును! తొందరపడిందా తను? ఏమిటో పెద్దదాన్నయినకొద్దీ అర్థంలేని పనులు చేస్తున్నాను. తన జీవితంవైపు తొందరగా పరుగిడుతూంది. ఇన్నాళ్ళకు కనపడిన "అనంత్"ని చిరకాలంగా తిన మనస్సు మల్చుకున్న జీవ ప్రతిమ సాక్షాత్కరించే సరికి కన్నెత్తి చూడలేక పోయింది. పన్నెత్తి పల్కరించలేక పోయింది! అతను చివరికి అస్తమయదృశ్యాన్ని చిత్రించాడో లేదో! కనుక్కుంటే ఏంపోయింది? +3 అద్దాల కళ్ళజోడు వెనకాతలి ఆమె కలువరేకుల్లాంటి సోగకళ్ళలో నీళ్ళు కూడుకుంటూంటే కెరటాలు ఆశ్చర్యపోతూ ముందుకువచ్చి ఆమె పాదాల్ని చల్లగాస్పృశిస్తున్నాయ్. చివాల్న లేచి తన బంగళా వైపు నడువసాగింది. వుమెన్సు కాలేజ్ ప్రిన్సిపాల్ మిస్ అరుణ!

"వెళ్ళిపోతోందేం?" అన్నట్లు వెనుక కాస్సేపు పరుగెట్టి మళ్ళుతున్నాయ్ కెరటాలు.

"వెళ్ళనీ! ఈరోజు ఆమెకోసం ఎదురుచూసే వారున్నారు అనుకొంటూంది" అన్నాయ్ కొబ్బరిఆకులు.

"ఆమె చిరకాల తపస్సు ఫలించబోతోంది. నా ప్రజ్ఞ అంతా చూపెట్టాలి" అన్నట్లు చంద్రుడు నిండు ముఖంతో నవ్వబోయాడు.

"నా ముందు నీ ప్రజ్ఞ ఎంత? నేను కరుణిస్తేనే కదా నీవు వెన్నెలలు విరియించేది?" మేఘరాజు దర్జాగా దగ్గరకు వస్తున్నాడు.

"ఎవళ్ళ గొడవ, అహంభావం వాళ్ళదేకాని మనకు అసలు విషయం ఎరుకపరచరు!" కెరటాలమీద ఉయ్యాల లూగుతున్న చిన్న నీటికాకి అంది.

"నన్ను చెప్పనిస్తే చెప్తాను" కెరటాల వేగానికి కరిగి సురిగిపోతున్న తీరపు ఇసుక అంది. అన్నీ మౌనం వహించాయ్. ఇసుక చెప్పింది :

"అరుణను ఓయింటిదాన్ని చేయాలని ఇంట్లోవాళ్లూ, చేసుకోవాలనిబయటివాళ్లూఅనుకున్నారు. కాని అరుణకుఆసక్తి లేదు. ఆమెకు లోకంలో ఏ పురుషుని సామంతమూ నచ్చ లేదు! ఎవ్వరి వేడి చూపుకీ కరిగిపోలేదు! ఎవ్వరిముందూ తలవంచుకోవాల్సిన లజ్జ వేయలేదు! ఎవ్వరిని భర్తగా అంగీకరిస్తుంది? అందరూ ఆమె కళ్ళకి పసికుర్రాళ్ళా కనపడే వారు! వయస్సులేని ఆ పెద్దతనం ఎలానో ఆమెని ఆక్రమించు కుంది! ఉద్యోగంలోచేరిన కొత్తలో :—"ఆమె పెండ్లెందుకు చేసుకోకూడదూ?" ఒక ప్రశ్న! "ఆమె అందానికి తగ్గవా ళ్ళెవరు?"

ఒక రసజ్ఞత!

"ఉద్యోగం చేసుకుంటోంది హాయిగా! అదో అడ్డు కూడా ఎందుకూ? ఒక అమూల్య భావం!

"ఆమె ధరణి!" ఒక ఆప్యాయిత!

"పురుషద్వేషిణి అయిన రాజకుమార్తె."

ఒక యువతి!

ఏది ఏమయినా, అభాగ్యత వరించి నిర్వాసురాలైన లెక్చరర్ సావిత్రికి ఆమె సోదరీసమాన !!

"అది తెలుసు! మాకు తెలుసు!" అన్నీ ముక్త కంఠంతో ఘోషించాయ్.

"మరి ఇప్పుడు ఆమె కర్తవ్యం?" అన్నాయ్ కెరటాలు. ఇసుకకు కోపం వచ్చింది. కెరటాల అవ్యక్తప్రశ్నకు.

"మీరు యుగయుగాలుగా చంద్రునికోసం చేతులు చాపుతున్నారు. ఇప్పుడు మీరు నిర్వహిస్తున్న కర్తవ్యం ఏమిటి చెప్పండి?" విసురుగా పైకి ఎగిరింది ఇసుక! కెరటాలకి ఉక్రోషం ముంచు కొచ్చింది. ఇసుకని తమలోకి లాక్కుందామని చేతులు బారలుచాపుతూ ముందుకురికాయ్. కాని ఆ యిసుక అప్పటికే వాయుదేవుణ్ణి ప్రార్థించి రెక్కలు వరంగా తెచ్చుకుంది! కెరటాలని సముదాయించలేని చంద్రుడు తమమధ్య గల దూరాన్ని సహించలేక మేఘరాజు చాటున మరుగుపడ్డాడు.

"మీకోసమే ఎదురు చూస్తున్నాం! భోజనం చెయ్యకుండా ఎటెళ్ళారూ?" అంది సావిత్రి. అరుణ వదలిపెట్టివెళ్ళిన ఫెల్మ్‌ని చదువుతున్న అతను అరుణకేసి చూశాడు! అరుణకి ఏదో బాధ అనిపించింది. సావిత్రి ఆప్యాయతకు.

"తలనొప్పిగా వుంటేనూ, అలా సముద్రతీరానికెళ్లాను. మీ భోజనాలయినాయా?"

ఆఁ! అబ్బాయి ఫస్ట్‌షో పిక్చరుకికూడా వెళ్ళివచ్చాడు. అరుణతలెత్తి అతనివెంపుచూసింది. కళ్లజోడుచేతుల్లోకి తీసుకుని చెంగుతో కళ్లుతుడుచుకుని మళ్ళాకళ్లజోడు పెట్టుకుంది.

"వీడు మా అబ్బాయి! శాంతినికేతనంలో చదువు కుంటున్నాడు. ఈవిడ మా ప్రిన్స్‌పాల్ మిస్ అరుణ!" పరిచయం చేసింది.

"అరే! మనిద్దరి పేర్లు ఒకటేనే!" అన్నాడు. అతను చనువుగా.

"అలాగా!" అంది. అరుణ.

"అవును. మా అబ్బాయి పేరు అరుణ్‌కుమార్ సాహా! వారు అస్తమానూ "అరుణ!" అనిపిల్చేవారు. సావిత్రికళ్ళు తడి అయ్యాయ్. అరుణముఖం తెల్లగా పాలిపోయింది.

"పాపం!" సానుభూతిగా అంది అరుణ. చెప్పేవాళ్ళకు వినేవాళ్లు లోకువ! సావిత్రి చెప్పుకపోయింది.

"ఆయన పేరు వినేవుంటారు అనంతకుమార్ సాహా అని. ఎంతో అద్భుతమైన చిత్రాలు గీసేవారు. ఏవో చిత్రాలు గీసుకునేందుకు "రామసముద్రం" అనే పల్లెకు వెళ్ళారు. అక్కడ ఏమయిందో. వచ్చాక ఒక్క చిత్రము గీయలేదు. అయిదారు నెలలు ఎటో చూస్తూ శూన్యంగా గడిపారు. మళ్ళీ ఒకరోజు "రామసముద్రం" వెళ్ళారు. నెల్లాళ్ళు వుంటానని చెప్పిన మనిషి మర్నాడే తిరిగొచ్చారు. వచ్చినవారు అల్లానే మంచం పట్టారు. అస్తమానం ఏవో మాట్లాడుకునేవారు. ఎంత ఐస్ పెట్టినా ఆయన బుర్ర వేడి తగ్గేదికాదు. కుర్రవాడంటే ఆయనకు ప్రాణం. వాడు ప్రక్కనున్నాసరే! "అరుణా! నీ అస్తమయాన్ని భరించలేను." అనే వారు." చేతుల్లో ముఖం కప్పుకుంది.

"చివరికి అరుణ్‌కి ఏమీ మిగలకుండా చనిపోయారు అరుణా!"

"అవును. ఏమీ మిగల్చలేదు" అంది అరుణ.

"నేనే ఎల్లానో చదువు చెప్పించాను. చక్కగా ఇంజనీరింగ్ కోర్సు చదవమన్నాను. కాని వినలేదు. శాంతి నికేతనంలో ఆర్టు నేర్చుకుంటున్నాడు. తండ్రిలాగే మొండి. ఆయన అల్లాగే! 'రామ సముద్రం'నించి బారశాలకు వచ్చాడు! మామగారి పేరు పెడదామనుకున్నా! అరుణ! అని బియ్యంలో వ్రాసేశారు! మీరు చెప్పండి, ఆర్టువలన లాభంవుంటుందా? వాళ్ళనాన్న ఇల్లాగే చిత్రాలు వేసివేసి భావోన్మాదియై అపమృత్యువుని కొని తెచ్చుకున్నారు! మళ్ళీ వీడుకూడా అల్లాగే......

అరుణ సావిత్రినోటిమీద వేలుంచింది.

"అంతమాటనకండి సావిత్రి!"

అరుణకళ్ళు వేయికాంతులు విరజిమ్మాయ్!"

"థాంక్సండీ! మీరునాకస్టోడియన్ అయినందుకూ! బొత్తిగా అమ్మచూడదండీ! పోనీ సెలవులు అని వచ్చానా! ఈమెదగ్గర కుంచెలూ రంగులూ నిషేధం! రేపే సముద్ర తీరానికి వెళ్లి అరుణాస్తమయ దృశ్యాన్ని చిత్రిస్తాను. ఇవ్వాళ చూశాను! ఎంత మనోహరంగా వుందనుకున్నారు!" సంతోషంగా అన్నాడు. అరుణ్

అరుణ అతన్ని తదేకంగా చూసింది. ఆమె మనస్సాగరంలో మాతృత్వపు మహోత్సాహం కెరటాలలా లేచింది.

"ఎవరిసరదా వారిది బాబూ" అంది అరుణ.

"కానిలబ్ధివుండాలి." మళ్ళాఅంది. సావిత్రిమౌనంగా గతాన్ని నెమరుకు తెచ్చుకుంటోంది. అరుణకేసి ఆశ్చర్యంగా చూశాడు. ఆమెఅంటే అతనికేదో అపేక్షకలిగింది, "మీరు బాగా పాడతారుట కదూ! అమ్మచెప్పింది. ఒక్క–జయదేవ కృతి పాడరూ! ఒక్కటి నాకోసం"

అరుణ తనగదిలోకి పరుగెట్టింది. తనకోసం "సాహో' రామ సముద్రం వెళ్ళాడన్నమాట! జన్మలో ఒక్కసారైనా చూడగలననుకొంది. చూడలేకపోయింది. కళ్ళవెంట అవిర ళంగా నీళ్లుధారలుకట్టున్నాయ్. కిటికీలోంచి దూరంగా కన బడుతున్న కెరటాలవంక చూస్తూ స్థాణువులా నిలబడింది అరుణ!